# ఆంధ్ర వైభవము

- సుశ్రీ,

**గత సంచికలో ...**

ఆంధ్రవిష్ణువు, శాతవాహనులు, ఇక్ష్వాకులు, పల్లవులు, చాళుక్యులు, చోళులు, కాకతీయులు, బొబ్బిలి, విజయనగరరాజులు, రెడ్డిరాజుల గురించి విషయములు ప్రస్తావించడం జరిగింది.

**(గత సంచిక తరువాయి భాగము)**



హంపిలోని సంగీతాన్ని వినిపించే స్తంబములతో నిర్మించబడిన విఠ్ఠల దేవాలయము.

బహమనీ సామ్రాజ్యం, విజయనగర సామ్రాజ్యం - ఢిల్లీ నవాబులకు ప్రతికూలంగా ఏర్పడినవి. విరూపాక్షుని పేరున విద్యారణ్యస్వామి ప్రోత్సాహముతో తుంగభద్రా నదీ తీరంలో హరిహరరాయులతో విజయనగర సామ్రాజ్యం స్థాపించబడింది. శ్రీకృష్ణదేవరాయుల కాలంలో తెలుగుతేజం నలు దిశలా విస్తరించింది. స్వయముగా తెలుగువాడు కాకపోయినా శ్రీకృష్ణదేవరాయులు తెలుగు భాషకు చేసిన సేవ నిరుపమానమైనది. "తెలుగదేలయన్న దేశంబు తెలుగేను - తెలుగు వల్లభుండ తెలుగొకండ - యెల్లనృపులు గొలువ నెరుగవేబాసాడి - దేశభాషలందు తెలుగు లెస్స" అని సగర్వంగా చెప్పుకున్న ఆంధ్రభోజుడు ఆముక్తమాల్యదను రచించాడు. ఈయన కొలువులో అష్టదిగ్గజములనెడి ఎనిమిది మంది ఆస్థానకవులుండెడివారు. వీరిలో మనుచరిత్ర రచించి శ్రీకృష్ణదేవరాయులచే గండపెండేరము తొడిగించుకున్న ఆంధ్రకవితా పితామహుడు అల్లసాని పెద్దన అగ్రగణ్యుడు.ముక్కును సంపంగిపువ్వుతో పోల్చి ముక్కు తిమ్మనగా పిలువబడిన నంది తిమ్మన పారిజాతాపహరణము, వికటకవిగా ప్రసిద్ధినొందిన తెనాలి రామకృష్ణుని పాండురంగ మహత్యము, ధూర్జటి విరచిత శ్రీకాళహస్తీశ్వరమహత్యము మరియు శ్రీకాళహస్తీశ్వర శతకము, రామరాజభూషనుని వసుచరిత్ర, ద్వ్యర్థి కావ్యము రాఘవ పాండవీయం రచించిన పింగళి సూరన రచన కళాపూర్ణోదయం సుప్రసిద్ధములు. అల్లసాని పెద్దన, నంది తిమ్మన, తెనాలి రామకృష్ణ, పింగళి సూరన, ధూర్జటి, రామరాజభూషణుడు, అయ్యలరాజ రామభద్రకవి, మాదయగారి మల్లనతో కూడిన అష్టదిగ్గజ కవులు భువనవిజయం కీర్తిని చిరస్మరణీయం చేసారు.

అనంతరము కుతుబ్ షాహీ వంశస్తుల కాలంలో తెలుగుకు ప్రత్యేక స్థానమీయబడింది. ఇబ్రహీం ఖులీకుతుబ్ షా హిందూ స్త్రీ 'భాగీరథి'ని వివాహమాడి హిందూ ముస్లిం సఖ్యతకొరకు పాటుపడి తెలుగు కవులచే కీర్తించబడ్డాడు. కూచిపూడి కళాకారులకు ఓ గ్రామాన్ని (కూచిపూడి గ్రామాన్ని) వ్రాసి, ఈ కళను అజరామరం చేసాడు. ఈయన కుమారుడు సుల్తాన్ మహ్మద్ ఖులీకుతుబ్ షా మూసీ నదికి 10 కిలోమీటర్ల దూరంలో ఆయన ప్రేయసి 'భాగమతి' పేరున భాగ్యనగరాన్ని నిర్మించాడు. అదే నేటి హైదరాబాద్. ఈయన పార్సీ, ఉర్దూలతో పాటు తెలుగులో కూడా చక్కని కవిత్వం చెప్పి నాటి కవులను మెప్పించాడు. ఈ వంశములో చివరి రాజైన అబ్దుల్ తానీషా కాలంలోనే భక్త రామదాసుగా ప్రసిద్ధి పొందిన 'కంచర్ల గోపన్న' గోల్కొండలో జైలు శిక్షను అనుభవించాడు. ఈయన వ్రాసిన "నను బ్రోవమని చెప్పవే సీతమ్మ తల్లి! నను బ్రోవమని చెప్పవే ...", "ఏ తీరుగ నను దయ జూచెదవో ఇనవంశోత్తమ రామా, నా తరమా భవసాగరమీదను నళినదళేక్షణ రామా ...", "పలుకే బంగారమాయేనా కోదండపాణి! ..." లాంటి ఆణిముత్యాలు నాటికి నేటికి నిత్యనూతనంగా వున్నాయి. రేపటి తరానికి వీటిని అందించవలసిన బాధ్యత మనందరిదీ.



*1591లో ప్లేగువ్యాధి నిర్మూలనకోసం హైదరాబాద్ లో నిర్మించిన చార్మినార్.*

ఆ తరువాత బ్రిటిష్ పాలనలో దాస్య శృంఖలాలను ఛేధించేందుకు ఎందరెందరో దేశభక్తులు ప్రాణత్యాగం చేసారు. మహాత్మా గాంధి నాయకత్వంలో సహాయనిరాకరణ ఉద్యమం ప్రారంభమైన సమయంలో 'స్వాతంత్ర్యం మా జన్మహక్కు' అంటూ బాలగంగాధర తిలక్, నెహ్రూ, సుభాష్ చంద్రబోస్ తదితరులు ఇచ్చిన పిలుపుకు స్పందించి టంగుటూరి ప్రకాశం పంతులుగారు, దుగ్గిరాల గోపాలకృష్ణయ్యగారు మొదలైన వారు క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నారు. చివరకు 1947 ఆగష్టు 15వ తేదీన భారతమాతకు దాస్య విముక్తి లభించింది. తెలుగువారికొక రాష్ట్రం కోరుతూ ఉద్యమాన్ని చేపట్టి కొండా వెంకటప్పయ్య, పట్టాభి సీతారామయ్య మొదలైనవారు ఆంధ్రరాష్ట్రం కోసం కృషి చేసారు. పొట్టి శ్రీరాములు ఆమరణ నిరాహార దీక్ష సాగించి ప్రాణ త్యాగం చేసిన తరువాత ఆంధ్రరాష్ట్రము అవతరించింది. టంగుటూరి ప్రకాశం పంతులుగారు దీని తొలి ముఖ్యమంత్రి.

విష్ణుశర్మ సంస్కృతమున వ్రాసిన పంచతంత్రకథలను పరవస్తు చిన్నయ్యసూరి తెలుగునకు అనువదించారు. సంఘ సంస్కర్త శ్రీ కందుకూరి వీరేశలింగం పంతులుగారు వితంతు పునర్వివాహములను ప్రోత్సహించారు. ఈయన నవల 'రాజశేఖరచరిత్ర' ఓ ప్రత్యేకశైలిలో నడుస్తుంది. ఇవేకాక నాటకాలు, ప్రహసనాలు, స్వీయచరిత్ర మొదలైన నూతన ప్రక్రియలను ప్రవేశపెట్టారు. ఇక గురజాడగారి 'ముత్యాలసరాలు' జాతికి ఆభరణాలు. "దేశమంటే మట్టికాదోయ్ దేశమంటే మనుషులోయ్" అని కుండ బ్రద్దలు కొట్టినట్లు చెప్పడం వీరి ప్రత్యేకత. ఈయన 'కన్యాశుల్కము' నాటకాన్ని మించిన నాటకం ఇంతవరకు వెలువడలేదంటే అతిశయోక్తి కాదు. ఈ నాటకాన్ని ఎన్నిసార్లు ప్రదర్శించినా నిత్యనూతనంగా ఉంటుంది. "ఏ దేశమేగినా ఎందు కాలిడినా పొగడరా నీ తల్లి భూమి భారతిని" అంటూ రాయప్రోలు సుబ్బారావుగారు మన కర్తవ్యాన్ని గుర్తుచేసారు. ఆంధ్రావళి, జడకుచ్చులు ఈయన కలమునుండి జాలువారినవే. ఇక కవి సామ్రాట్ విశ్వనాధ సత్యనారాయణగారు 'రామాయణ కల్పవృక్షము', వేయి పడగలు' వంటి ప్రఖ్యాత రచనలు చేసి జ్ఞానపీఠ్ సత్కారాన్ని పొందినవారిలో ప్రథములు అయ్యారు.

నండూరి సుబ్బారావుగారి ఎంకి పాటలు, దేవులపల్లి కృష్ణశాస్త్రిగారి భావ కవిత్వం, సినీ సాహిత్యం (మరపురాని మధుర స్వరాలు), నవయుగకవి చక్రవర్తి జాషువాగారి 'గబ్బిలం', కరుణశ్రీ జంధ్యాల పాపయ్యశాస్త్రిగారి 'కుంతికుమారి', 'పుష్పవిలాపం', వారి వారి గొప్పతనాన్ని తెలియజేసే కొన్ని రచనలు మాత్రమే. పుష్పవిలాపం చదివిన లేదా విన్న ఏ వ్యక్తి అయినా చెట్టు నుండి పూవులను కోసే ప్రయత్నం చేయలేడు. మాటలు జంధ్యాల పాపయ్య శాస్త్రి గారివైనా అవి కుసుమాలే నోరెత్తి పలికాయా! అన్న అనుభూతి కలుగుతుంది. అందుకే ఇలాంటి రచనల్లో కవి కనిపించకుండా సన్నివేశానికి జీవం పోస్తాడు. వ్యంగ్యానికి అన్నా 'కనిపించకుండా వినిపించేవాడు కవి' అన్న దానిలో కొంత నిజం వుంది.

శ్రీరంగం శ్రీనివాసరావు (శ్రీశ్రీ) గారు 'మహాప్రస్థానం'తో అభ్యుదయ కవితకు పునాది వేసారు. ఏమి రాసినారే అనిపించే డాక్టర్ సి. నారాయణరెడ్డి (సినారె) గారి 'నాగార్జునసాగరం', 'ప్రపంచపదులు', 'సినారె గజళ్ళు' ఆయన ఖ్యాతిని ఖండాంతరాలకు చాటాయి. వీరి విశ్వంబర వచన కావ్యానికిగాను జ్ఞానపీఠ్ పురస్కారము లభించింది. తిలక్ (అమృతం కురిసిన రాత్రి), గిడుగు రామమూర్తి పంతులుగారు, కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారు సురవరం ప్రతాపరెడ్డి గార్ల భాషా సేవ ప్రశంసనీయం. తాపీ ధర్మారావు, నార్ల వెంకటేశ్వరరావు, నండూరి రామమోహనరావు తెలుగు జర్నలిజంలో, చిలకమర్తి లక్ష్మీనరసింహం పంతులుగారు వ్యంగ్య ప్రహసనాలకు, పానుగంటి లక్ష్మీ నరసింహారావుగారు వ్యాసాలకు, భమిడిపాటి కామేశ్వరరావుగారు హాస్యరస పోషణకు, బాపూగారు కార్టూనులకు, ముళ్ళపూడి వెంకటరమణగారు సెటైరు వ్రాయడంలో సిద్ధహస్తులు.

(తరువాయి భాగము వచ్చే సంచికలో)